



సాయంత్రం ఆరుగంటలు దాటింది. నిత్యానందం, అప్పుడే ఆఫీసు నుంచి వచ్చాడు. శారదమ్మ "కూచోండి కాఫీ తీసుకొస్తాను." అని లోపలికి వెళ్ళబోయింది. "కాస్సేపాగు శారదా! నేను స్నానం చేసి వస్తాను .." అంటూ గదిలోకి వెళ్ళి దుస్తులు మార్చుకుని బాత్రూమ్‌కి నడిచాడు, నిత్యానందం.

తొందరగా స్నానం ముగించి వచ్చి, దుస్తులు వేసుకుని సోఫాలో కూచున్నాడు.

విసుగ్గా చేతివాచీ చూసుకున్నాడు. నిత్యానందం. ఆరుంబావు కావెడుతోంది వాచీ.

"శారదా, తొందరగా కాఫీ తీసుకురా.. నాకు వేళవుతోంది...." కేక వేశాడు.

శారద, కాఫీ కప్పుతో వచ్చింది. భర్తకి కాఫీ అందిస్తూ.

"అబ్బబ్బ ఏమిటండీ మీ ఆత్రుత, మీ ఆత్రుతతో బాటు నన్ను కంగారు పెట్టేస్తున్నారు. ఇప్పుడేగా , ఆఫీసు నుంచి వచ్చారు. వచ్చిన వెంటనే మళ్ళీ బయల్దేరి పోతున్నారేమిటి?" అంది.

"ఇది కొత్త విషయం కాదుకదా శారదా. రిహార్సిల్సుకి వెళ్ళొద్దా?"

"ఎప్పుడూ రిహార్సిల్సు అంటారే గాని,యింట్లో సరుకులు వున్నాయో, లేవో కూడా పట్టించుకోరు ఠీవిగా భోజనానికి మాత్రం వచ్చేస్తా వుంటారు.." అంది, కాస్త విసుగ్గా.

వాదనలోకి దిగితే లాభం లేదని సన్నగా నవ్వేశాడు, నిత్యానందం.

"రిహార్సిల్సు యెగ్గొట్టే బాపతు నేను కాదని నీకు తెలుసు. ఈ ఒక్క పూటకి మేనేజ్ చెయ్యి. నీకు యేమిటి కావాలో, రేపు ఉదయం ఓ లిస్టు రాసిస్తే తీసుకొచ్చేస్తాను. ఈ రోజు స్టేజి రిహార్సిల్సు వున్నాయని చెబుతూనే వున్నాను కదా. నువ్వే నన్నర్థం చేసుకోపోతే యెట్లా చెప్పు?" అన్నాడు సౌమ్యంగా.

భర్త చెప్పిన తీరుకి, నవ్వొచ్చేసింది శారదకి. ఆమె యింకేమో అనే లోపలే

మళ్ళీ అందుకున్నాడు నిత్యానందం.

"నీ సహకారం లేందే నేను మాత్రం నాటకాలు వెయ్యగలనా? నాటకం రోజున, నా నటనా కౌశలాన్ని చూసి ముగ్ధులై, ప్రేక్షకులు హాలు దద్దరిల్లిపోయినట్టు చప్పట్లు కొట్టినపుడు, ప్రేక్షకుల్లో ఒకరుగా నువ్వూ యెంతగా మురిసిపోతావని? భర్త అంతటి ఆదరణ పొందుతూ వుంటే యే భార్యకు గర్వంగా వుండదని?' అంటూ మందహాసంతో భార్య చెక్కిలిపై మీటుతూ, ఖాళీ చేసిన కాఫీ కప్పు భార్యకు అందించాడు నిత్యానందం.

శారద, నవ్వకుండా వుండలేకపోయింది. ఆయన మాటల చాతుర్యం ఆమెకి కొత్తేం కాదు మరి. "యీ మాటలతోనే మైమరిపించేస్తారండీ. ఎంతయినా నటులుకదా మరి నటనో కేవీ లోటుండదు." ముసిముసి నవ్వింది.

"నటన కాదు శారదా! ఇది వాస్తవం. నాకు లభించే ఆదరణలో నీకెప్పుడూ భాగం వుంటుంది కదా? నాటకం రోజున చూద్దువుగాని..."

"ఆ! దానివల్ల వచ్చేదేమిటి లెండి. గాలిలో కలిసిపోయే చప్పట్లు.... పనికిరాని శుష్కమైన పొగడ్తలూను, అంతకుమించి యేముంటాయి గనక." తేలిగ్గా అనేసింది శారద.

ఆమె మాటల్లో నిరుత్సాహం ధ్వనించింది.

నిత్యానందం, మెల్లగా నవ్వేడు మళ్ళీ. "ఇదిగో! మీ ఆడాళ్ళతో యిదేనోయ్ చిక్కు. ప్రతీ దాంట్లోనూ మనకు వచ్చే లాభం యేమిటా అని బేరీజువేస్తూ ఆలోచిస్తారు. అటువంటి దృక్పథంతో ఆలోచిస్తే, యింక లలిత కళలకి విలువేముంటుంది? అవి అభివృద్ధి చెందేది యెలా? చూస్తున్నాంగా లలిత కళలకు యెలా ప్రాముర్యం తగ్గిపోతోందో, ముఖ్యంగా నాటక కళకి...."

"అంటే, నాటక కళకి ప్రాముర్యం తగ్గిపోవడం, కేవలం మా ఆడవాళ్ళవల్లనే నంటారు...ఏం?" సీరియస్‌గా మొహం పెట్టింది.

నిత్యానందం కంగారు పడ్డాడు. భార్యకి కోపం వచ్చిందంటే తాను రిహార్సిల్సుకి గుడ్‌బై చెప్పాల్సి వస్తుందేమోనని? భయపడ్డాడు.

"అబ్బెబ్బే! కేవలం మీ ఆడవాళ్ళ వల్లనే ఆదరణ కొరవడుతుందనను. చాలా మందికి, ఫలాపేక్ష వుంటుందని నా అభిప్రాయం. చెప్పుకోవాలంటే యిటువంటి అభిప్రాయం మా పురుషుల్లోనూ కొందరికుంది...ఆ.. నాకు వేళవుతోంది. ... వస్తా మరి ఆ లిస్టు రాసి వుంచు. రేపు ఉదయం అన్నీ తీసుకొచ్చేస్తాను..." అంటూ టేబిల్ మీదున్న పోర్షన్ పుస్తకాన్ని పట్టుకుని హడావిడిగా బైటికి నడిచాడు, నిత్యానందం.

శారద మెల్లగా నవ్వుకుంది... భర్తకి, నాటకాలంటే యెంత పిచ్చో, ఆమెకి తెలుసు. నిద్రాహారాలు లేకపోయినా, చేతిడబ్బు అప్పుడప్పుడూ వదులుతున్నా లెక్కచెయ్యకుండా, ఆ ధ్యాసలోనే వుంటారని? బాగా తెలుసు. ఆయన దృష్టిని మార్చాలని యెన్నోసార్లు ప్రయత్నించిందిగాని ప్రయోజనం లేకపోయింది. నటనారంగంలో, ఆయనకి ఆర్థికపరమైన ప్రయోజనం యేమీ లేకపోయినా, ఆయన నటనకి ప్రేక్షకుల్నించి వచ్చిన, వస్తోన్న అభినందనలు, కరతాళధ్వనులు, ప్రశంసలు, ఆనందాంబుధిలో ముంచెత్తుతూ వుంటే యింక ఆయన్ని ఆ ధ్యాస నుంచి, ఆ పిచ్చి నుంచి మరల్చడం తనకిక సాధ్యంకాదేమోనన్న ఓ నిర్ణయానికొచ్చేసి వూరుకుంది. అందుకే, ఆయన్ని పల్లెత్తుమాట పరుషంగా అనలేకపోతోంది. ఆయన మనసు నొప్పించడం, సుతరామూ ఆమెకి యిష్టం వుండదు. ఆయన ఆనందంలో తానూ పాలుపంచుకుని, అటువంటి భర్తను పొందినందుకు యెంతగానో మురిసిపోతూ వుంటుంది. ఒక్కొక్కప్పుడనుకుంటూ వుంటుంది కూడాను – అది, తన పూర్వజన్మ సుకృతమేనని?.. యిలా సాగినాయ్ శారద ఆలోచనలు.

ఆలోచనల నుంచి తేరుకున్నాక, తలుపువేసుకుని లోపలికి వెళ్ళిపోయింది, శారద.


* * *

నిత్యానందం యెన్నో నాటిక, నాటకాల్లో మంచి వేషాలు వేసి ప్రేక్షకుల ఆదరాభిమానాన్ని పొందాడు. ఒక విషయాన్ని మాత్రం మర్చిపోడు. తాను పొందుతున్న యి ప్రశంసల్లో శారదకీ భాగముందని. ఆమె సహకారం లేందే తాను రిహార్సలకే వెళ్ళలేకపోయేవాడు. ఇది అతని అంతరంగ అనుభూతి.

నిత్యానందం కొత్తగా ప్రాక్టీసుచేసిన నాటకం ఆ రోజే ప్రదర్శింపబడుతోంది. నాటకం పేరు వెన్నెల.

నిత్యానందం నాటకం వేస్తున్నాడంటే చాలా మంది చూడ్డానికి వస్తారు.

అందుకే, ఆరోజు హాల్లో జనం క్రిక్కిరిసి వున్నారు. వారిలో శారద కూడా ప్రేక్షకురాలే! ఆమె నాలుగో వరుసలో కూచుందేగాని, మనసులో యేదో ఆరాటం యేదో ఆత్రుత? భర్త నిత్యానందం నాటక కథ చెప్పారు ఆయన పాత్ర గురించీ చెప్పారు. అయితే ఆరోజు ఆయన నటన ఎలా వుంటుందో, పాత్రపోషణ ఎలా వుంటుందో, ప్రేక్షకులు ఆయన నటనకి ఎలా స్పందిస్తారో, ఆయన్ని మెచ్చుకుంటారో లేదో యెప్పటి లాగానే మిన్ను ముట్టిన



కరతాళధ్వనులతో అభినందిస్తారో లేదో ....? అన్న ప్రశ్నలు ఆమె హృదయంలో చిన్న అలజడిని రేపాయి. అది సహజమైనది. భార్యగా ఆమెలో ఆ ఆలోచనలు రావడంలో తప్పులేదు.

నాటకం ప్రారంభమయ్యింది శారదలో వుత్కంఠ పెరుగుతోంది. తన భర్తను అందరూ అభినందించి మెచ్చుకోవాలేగాని, విమర్శించకూడదన్న స్వార్థం ఆమెలో చోటు చేసుకుంది.

రెండు గంటలసేపు నాటకం ప్రదర్శింపబడింది. అద్భుతంగా వుంది. నిత్యానందం నటించిన ప్రతి సీనులోనూ చప్పట్లే... అతని నటన ప్రేక్షకులు అంతగా స్పందించారు. శారద మనస్సు కుదుటపడింది. ఆమెలో వుత్కంఠ క్రమంగా కరిగిపోయింది. ఆమెలో ఆనందం అవధులు దాటింది. నటుల ప్రతిభ, దర్శకుని ప్రజ్ఞ, సమపాళ్ళలో వుండన్నారు ప్రేక్షకులు. నిత్యానందం క్లైమాక్సు సీనులో అద్భుతంగా నటించి, 'వెన్నెల' నాటకానికి నిజంగా వెన్నెల తీసుకొచ్చాడన్న పొగడ్తలు సర్వత్రా లభించాయి. అందరి మన్ననల్నీ పొందాడు. ఆ మన్ననల్నీ, అభినందనల్నీ, తనే పొందుతున్నట్టుగ మౌనంగా ఫీలయ్యింది శారద.

'వెన్నెల' నాటకంలో వుత్తమ నటునిగా నిత్యానందం యెన్నిక చేయబడ్డాడు. అతనికి ఓ మెమెంటోను. అందజేసి, ఆనాటి బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాలేజీ ప్రిన్సిపాల్ రఘునాథరావు, నిత్యానందాన్ని అభినందిస్తూ, అతనికి ఉజ్వల భవిష్యత్తు వుందని భవిష్యద్వాణి చెప్పారు.

బహుమతిని అందజేశాక, నిత్యానందంని మాట్లాడమన్నారు రఘునాథరావుగారు

నిత్యానందం మైకు ముందుకు వస్తుంటే హాలంతా కరతాళధ్వనులతో మారు మోగింది. ఆ చప్పట్లు కలిగించిన ఆనందంలో నిత్యానందం చప్పున మాట్లాడలేక పోయాడు. ఆ అనుభూతి అటువంటిది. గొంతు, త్రుటికాలం పూడుకు పోయినట్టయింది. గొంతు సవరించుకుని, మాట్లాడానికి మూడ్

> నేనెందుకు రాస్తున్నాను?
>
> • ప్రతి రచయిత గతం తాలూకు విత్తనం. ప్రస్తుతం మొక్క మొలిచి పెరిగి, పండి ముందుకు విత్తనాలను వదిలిపోతాడు. ఏ రచయిత తన గతాన్ని మర్చిపోతాడో అతని శరీరం పులకించదు. పులకించని మనిషి శాశ్వతమైనదేదీ సృష్టించలేడు. మీరు దాన్ని పట్టుదల అనండి, ఇన్స్పిరేషన్ అనండి, ఉత్తేజం - యేమనండి, యే ఘనకార్యం చేయాలన్నా గడిచిన తలపో, ఓ జాతి గర్వమో యేదో ఒక వానిటీ ఉండాలి.
>
> – బలివాడ కాంతారావు.
>
> భరాగో-అత్తలూరి సంకలనం నుంచి

తెచ్చుకున్నాడు.

గౌరవనీయులైన ముఖ్య అతిథి రఘునాథరావుగారికి వేదికపైనున్న యితర పెద్దలకు ప్రేక్షక మహాశయులకు నా కళాభినందనలు.

నాపట్ల, నా నటనపట్ల, మీరు చూపుతున్న అవ్యాజమైన యీ అభిమానానికి ధన్యవాదాలు. చెప్పుకుంటున్నాను. మీ అభిమానమే నాకు ప్రోత్సాహాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తోందంటే అతిశయోక్తి కాదు. మీ అభిమానమే నా ప్రగతి పునాదులు. మీ అభిమానమే లేకపోతే నేను యింతటి వాణ్ణి అయ్యేవాణ్ణి కాదేమో, అయితే, యిక్కడ. మరో విషయంకూడా చెప్పడం అప్రస్తుతం కాదనకుంటాను. మీరు నాటకాలు చూసి, ఆనందిస్తారు. నటీనటులకు అభినందనలు తెలుపుతారు. నాటకం బాగా లేకపోతే విమర్శిస్తారు. అయితే, యీ నాటక ప్రదర్శన వెనక యెంతటి కృషి ఉందో, యెన్ని సమస్యలు నిబిడీకృతమై వున్నాయో, యెవరూ అర్థంచేసుకోరు. పైగా, నాటకాలు వేసే వాళ్ళంటే కొందరిలో ఓ విధమైన న్యూన్యతా భావం వుంది. మరికొందరిలో యేహ్యభావం కూడా వుంది. నాటకాలు వేసేవాళ్ళు పాడైపోతారనే ఓ అపప్రథ వుంది. అది మాత్రం శుద్ధఅబద్ధం. అన్ని కళల లానే నాటక కళ ఓ పవిత్రమైన కళ. ఆ పవిత్రమైన కళకి కళంకం ఆపాదించడం క్షమించరాని నేరం. ఇందులో ఎక్స్ప్రెషన్స్ వుండవని కాదు. ఆ ఎక్స్ప్రెషన్స్ అన్ని రంగాలలోను వుంటాయి. వాటికి జనరలైజు చెయ్యకూడదంటాను. ఈ సందర్భంలో మీలానే నన్ను ప్రోత్సాహిస్తూ చేయూత నిస్తున్న నా శ్రీమతి శారదని అభినందించ కుండా వుండలేకపోతున్నాను. నా యీ విజయం వెనుక, పరోక్షంగా ఆమె హస్తం లేకపోలేదు. ఆమె సహకారం వుంది గనుకనే యీ నాటక కళలో యింత కృషి చెయ్యగలిగాను మీ అందరి అభిమాన్ని పొందగలిగాను. ఆమె కూడా మీలో ఒకరుగా ప్రేక్షకురాలు కాబట్టి మీ అందరికీ అభినందనలు చెప్పుకుంటున్నాను. ఇక ముందు కూడా మీ ఆదరాభిమానాలు యిలానే అందిస్తారని ఆశిస్తున్నాను. నన్ను ఉత్తమ నటుడిగా యీ నాటకంలో యెంపిక చేసినందుకు మరోమారు ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను..''

అంటూ కళాభినందనం చేసి, స్టేజి మీంచి దిగాడు నిత్యానందం. మళ్ళీ చప్పట్ల ధ్వని మార్మోగింది. అందరిలానే ఓ ప్రేక్షకురాలిగా హాల్లో కూర్చున్న శారద హృదయం, ఆనందంతో పులకించిపోయింది. ఆమె చుట్టూ కూర్చున్న స్త్రీలు ఆమెకేసి ప్రశంసా పూర్వకంగా చూస్తున్న చూపులు, ఆమెలో వింత అనుభూతిని కలిగించాయి. ఆమె కళ్ళల్లో ఆనందబాష్పాలు గిర్రున తిరిగినాయి. చీరచెంగుతో కళ్ళొత్తుకుంటూ 'తాను యెంత అదృష్టవంతురాలు? ఈ ఆనందం, యీ అనుభూతి, యింతమంది స్త్రీలలో తానొక్కతే పొందగలిగిందికదా? ఇంతకంటే కావాల్సిందేముంది?' అనుకుంది మనసులో.

నిత్యానందం వూరికినే అలా చెప్పలేదు. ఒక నటుడిగా, నాటకకళ పట్ల ఓ రకమైన సద్భావాన్ని ప్రేక్షకులకు కలిగించ ప్రయత్నించాడు. ఆ విధంగా, భార్య సహకారాన్ని ముందు ముందు నిరాఘాటంగా పొందేందుకు ఫీల్డు తయారుచేసుకున్నాడు, మంచినటుడైన నిత్యానందం.

ప్రేక్షకులు చప్పట్లు కొడుతున్నంత వరకు తాను నటిస్తూనే వుంటానని ఆరోజే ఒక నిర్ణయానికొచ్చాడు, నిత్యానందం!